సాక్షి
వికారాబాద్
మంగళవారం । 8 । అక్టోబర్ । 2024



ధరలు తగ్గించాలి

నిత్యావసరాల ధరలు తగ్గించాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకట్‌రాములు డిమాండ్ చేశారు. 10లో▸



'భగీరథ' సరఫరాలో..

మిషన్ భగీరథ నీటిని సక్రమంగా సరఫరా చేయాలని ఆ శాఖ ఈఈ చల్మారెడ్డి అధికారులకు సూచించారు. 10లో▸



సమస్యల ఊసే లేదు

ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామసభలు తూతూమంత్రంగా సాగుతున్నాయి. ప్రజా సమస్యలపై చర్చ జరగడం లేదు. 11లో▸

న్యూస్‌రీల్

పనుల్లో వేగం పెంచండి
సీడీఎంఏ గౌతమ్



అధికారులతో కలిసి కొడంగల్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న సీడీఎంఏ గౌతమ్

కొడంగల్: మున్సిపల్ పరిధిలో చేపట్టిన పనుల్లో వేగం పెంచాలని సీడీఎంఏ గౌతమ్ ఐఏఎస్ అన్నారు. సోమవారం కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో కలిసి మున్సిపల్ పరిధిలో జరుగుతున్న పనులపై క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, సకాలంలో పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. అనంతరం పట్టణంలోని డిగ్రీ కళాశాలను సందర్శించారు. ప్రతి అధికారి బాధ్యతగా విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణి మృతిపై విచారణ



తాండూరు నర్సింగ్ హోంలో వివరాలు సేకరిస్తున్న డిప్యూటీ డీఎం హెచ్‌ఓలు

తాండూరు టౌన్: అబార్షన్ వికటించి గర్భిణి మృతి చెందిన ఘటనపై సోమవారం జిల్లా వైద్యాధికారులు విచారణ చేపట్టారు. తాండూరు, వికారాబాద్ డిప్యూటీ డీఎం హెచ్‌ఓలు డాక్టర్ రవీందర్, డాక్టర్ జీవరాజ్ తాండూరు నర్సింగ్ హోంలో గర్భిణికి చికిత్స చేసిన డాక్టర్ హుస్నామహ్మద్ నుంచి వివరాలు సేకరించారు. పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన గర్భిణి అక్షిత(20) వైద్యం కోసం తాండూరు నర్సింగ్ హోంకు వచ్చి మృతి చెందిన విషయం తెలిసిందే.. వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ తల్లిదండ్రులు ఆరోపణలు చేయడంతో జిల్లా వైద్యాధికారులు విచారణ చేపట్టారు. గర్భిణి కడుపులోని శిశువు పరిస్థితిని, అబార్షన్ చేయడానికి గల కారణాలు, చికిత్స నిర్వహిస్తుండగా మృతి చెందడానికి గల కారణాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా విచారణ అధికారులు మాట్లాడుతూ.. గర్భిణి మృతిపై విచారణ చేపట్టామని, నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.

చిలుకూరు బాలాజీని దర్శించుకున్న సబితారెడ్డి



స్వామివారి సన్నిధిలో సబితారెడ్డి కుటుంబ సభ్యులు, నాయకులు

మొయినాబాద్: మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి కుటుంబ సమేతంగా చిలుకూరు బాలాజీని దర్శించుకున్నారు. సోమవారం ఆమె చిన్న కుమారుడు కళ్యాణ్ రెడ్డి దంపతులతో కలిసి చిలుకూరు బాలాజీ ఆలయానికి చేరుకున్నారు. గర్భగుడిలోకి వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు రంగరాజన్ సబితారెడ్డి కుటుంబ సభ్యులకు ఆశీర్వాదం అందించారు. ఆమె వెంట బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి, సీనియర్ నాయకుడు కొత్త నర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ కొత్త మాణిక్‌రెడ్డి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు జయవంత్, ప్రధాన కార్యదర్శి నర్సింహగౌడ్, మాజీ సర్పంచ్ సుధాకర్ యాదవ్, నాయకులు ఆంధ్రూ, సురేందర్‌గౌడ్, జీఎన్ రాజు, చెన్నయ్య, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్కేటింగ్ పోటీలు

తుక్కుగూడ: మున్సిపల్ కేంద్రంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి స్కేటింగ్ ఇంటర్ డిస్ట్రిక్ చాంపియన్‌షిప్ పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు పోటీల్లో తలపడుతున్నారు. సోమవారం 15కే, 10కే, 500 మీటర్ల పోటీలు నిర్వహించారు. బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి హాజరై క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 400 మందికి పైగా క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఆర్.రామకృష్ణ, గోపాల్‌రెడ్డి, విఠల్, అబ్బాస్, అజయ్, యాదయ్య, సత్యం, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



సింహవాహనంపై విహరిస్తున్న శ్రీవారు

సింహవాహనంపై స్వామివారు

వికారాబాద్ పట్టణంలో వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం స్వామివారు సింహ వాహనంపై ఆలయ మాఢ వీధుల్లో విహరించారు. అనంతరం కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో కాలనీ పెద్దలు, ఆలయ ప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆదివారం రాత్రి వికారాబాద్‌కు చెందిన చిన్నారులు నిర్వహించిన నృత్య ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది.

– అనంతగిరి



చిన్నారుల నృత్య ప్రదర్శన

ధాన్యం కొనుగోలుకు కసరత్తు



ధాన్యం సేకరణపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

- నాలుగు ఏజెన్సీల ద్వారా సేకరణ
- జిల్లాలో వరి సాగు విస్తీర్ణం.. 1.30లక్షల ఎకరాలు
- 2.8లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా
- సన్నరకం వడ్ల సేకరణకు ప్రత్యేక ఏర్పాట్లు
- నవంబర్‌లో ప్రారంభించాలని నిర్ణయం

వికారాబాద్: వానాకాలం సీజన్‌కు సంబంధించి పంట చేతికొస్తున్న నేపథ్యంలో అధికారులు ధాన్యం కొనుగోలుకు కసరత్తు చేస్తున్నారు. వడ్లు తామే కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. గతంతో పోలిస్తే ఈ ఏడాది రికార్డు స్థాయిలో వరి సాగయ్యింది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో వరి పండించిన ఏరియా.. దిగుబడి అంచనా మేరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. గతేడాది 120 కేంద్రాలు ఏర్పాటు చేయగా దాదాపు 20 కేంద్రాలకు ధాన్యం రాలేదు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఈ ఏడాది కొనుగోలు కేంద్రాలు తగ్గించాలని నిర్ణయించారు. సోమవారం అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ ఆధ్వర్యంలో ఆయా శాఖల అధికారులతో సమావేశం జరిగింది. జిల్లాలో 104 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సన్న రకం వడ్లకు ప్రభుత్వం రూ.500 బోనస్ ప్రకటించిన నేపథ్యంలో వాటిని కొనుగోలు చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

మద్దతు ధర రూ.2,300

కేంద్ర ప్రభుత్వం క్వింటాలు వడ్లకు రూ.2,300 మద్దతు ధర ప్రకటించింది. ఈ మొత్తం తామే చెల్లించి ధాన్యం కొనుగోలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు తగ్గట్లు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. క్వింటాలు ఏ గ్రేడ్ రకం ధాన్యానికి రూ.2,320 కాగా బీ గ్రేడ్‌కు రూ.2,300 చెల్లించనున్నారు. నవంబరు నుంచి కొనుగోలు చేయాలని భావిస్తున్నారు. ప్రస్తుత సీజన్‌లో 2.8లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేసిన అధికారులు 104 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

ధాన్యం నిల్వ కోసం స్థలాల గుర్తింపు

ప్రస్తుత సీజన్‌లో 1.30లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేయగా ఎకరాకు సగటున 22 నుంచి 25 క్వింటాళ్ల దిగబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ లెక్కన దాదాపు 3 లక్షల మెట్రిక్ టన్నుల పంట దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ చెబుతోంది. ఇందులో సీడ్ కోసం పోగా 2లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. జిల్లాలోని 70 రైసు మిల్లుల ద్వారా మిల్లింగ్ ప్రక్రియ చేపట్టేందుకు కసరత్తు చేస్తున్నారు. ధాన్యం నిల్వ కోసం స్థలాలను కూడా గుర్తించారు.

సన్నరకం వడ్ల కోసం..

ప్రభుత్వం సన్న రకం వడ్లకు రూ.500ల బోనస్ ఇస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా అధికారులు సన్న రకం ధాన్యం సేకరణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది 30 వేల ఎకరాల్లో సన్న రకం వరి పంట సాగు చేస్తున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. సన్న రకం వడ్లు ఎక్కువగా సాగవుతున్న ఏరియాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. సన్న రకం వడ్లకు సంబంధించి డాటా ఎంట్రీ సపరేటుగా చేయాలని నిర్ణయించారు.

“ఏర్పాట్లు చేస్తున్నాం



గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈ సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నాం. గత సీజన్‌లో తాలు, తరుగు, తేమ, మట్టి పెల్లల శాతం ఎంత ఉండాలనే విషయంపై కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సరిగ్గా అవగాహన లేక ఇబ్బందులు పడ్డాం. అందుకే ఈ సారి వారికి అవగాహన కల్పిస్తున్నాం. రైతులు తాలు మొత్తం తూర్పారపట్టి ఆరబెట్టిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తేవాలి. అలా చేస్తే ఎవరికీ ఇబ్బందులు ఉండవు. పక్క రాష్ట్రాల నుంచి తెలంగాణలోకి ధాన్యం తరలిరాకుండా సరిహద్దు ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేస్తాం.

– లింగ్యానాయక్, అడిషనల్ కలెక్టర్

నిబంధనలు బేఖాతరు

- ఇష్టారాజ్యంగా ప్రైవేటు ఆస్పత్రుల నిర్వహణ
- స్కానింగ్, ఎక్స్‌రే, బ్లెడ్ టెస్టుల పేరిట దండుకుంటున్న వైనం
- పట్టించుకోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ



అధిక బిల్లులు వేశారని పరిగిలోని ప్రైవేటు ఆస్పత్రి వద్ద ఆందోళన చేస్తున్న రోగి బంధువులు (ఫైల్)

పరిగి: ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు నిబంధనలకు నీళ్లు వదులుతున్నారు. జ్వరం, జలుబు వంటి సీజనల్ వ్యాధులకు కూడా పరీక్షల పేరిట నిలువునా దోచేస్తున్నారు. స్కానింగ్, ఎక్స్‌రే, బ్లెడ్ టెస్ట్ పేరిట ఇష్టానుసారంగా వసూలు చేస్తున్నారు. ధరల పట్టిక ఎక్కడా కనిపించడం లేదు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. డయగ్నోస్టిక్ సెంటర్ల నిర్వాహకులు రోగులకు తప్పుడు రిపోర్టులు ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. డబ్బుల కోసం లేని రోగాన్ని సృష్టించి వైద్యం చేస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. చికిత్స కోసం ఆస్పత్రికి వెళితే రూ. వేలల్లో బిల్లులు వేస్తున్నారని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జబ్బు తగ్గినా మరో రెండు రోజులు ఆస్పత్రిలోనే ఉండాలని, ఇంటికి వెళితే ఇబ్బంది పడతారని భయపెడుతున్నట్లు తెలిసింది. ఒక్కరోజు బెడ్, రూమ్ కోసం వేలల్లో వసూలు చేస్తున్నారు.

అనుమతులు ఒకదానికి.. చేసే చికిత్స మరొకటి

పరిగి పట్టణంలో పదుల సంఖ్యలో ప్రైవేటు ఆస్పత్రులు ఉన్నాయి. వైద్యశాఖ రిజిస్టర్‌లో మాత్రం కొన్ని ఆస్పత్రుల పేర్లే ఉన్నాయి. వైద్య వృత్తితో సంబంధం లేని వ్యక్తులు డాక్టర్లను తీసుకొచ్చి స్థానికంగా ఆస్పత్రులు, డయగ్నోస్టిక్ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. ఫార్మసీ కోర్సులు చదవకపోయినా.. కేవలం అనుభవం ఉన్న వారితో కేంద్రాలను నడిపిస్తున్నారు. ఒకరి పేరిట ఒకే మెడికల్ షాపు ఉండాలి.. కానీ ఒకే సర్టిఫికెట్‌పై అనేక దుకాణాలు నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా వైద్య ఆరోగ్యశాఖ నుంచి ఒక దాని కోసం అనుమతి తీసుకొని మరొక వైద్యం చేస్తున్నారు. జనరిక్ మందుల పేరుతో అడ్డగోలుగా దోచుకుంటున్నారు. షాపుల్లో విక్రయిస్తున్న మందులకు బిల్లులు సైతం ఇవ్వడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు నామమాత్రంగా తనిఖీలు నిర్వహించి చేతులు దులుపుకొంటున్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలడంతో..

ఇటీవల సీజనల్ వ్యాధులు ప్రబలడంతో ప్రైవేటు ఆస్పత్రులకు కాసుల పంట పండుతోంది. ప్రజలు మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి జ్వరాల బారిన పడుతున్నారు. జ్వరం తీవ్రత ఎక్కువగా ఉన్నవారు ప్రైవేటు ఆస్పత్రులకు వెళితే బ్లెడ్ టెస్ట్ పేరిట దండుకుంటున్నారు. రోగిని రెండు మూడు రోజుల పాటు ఆస్పత్రుల్లోనే ఉంచి చికిత్సల పేరిట వేల రూపాయలు వాసూలు చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రంగా ప్రైవేటు ఆస్పత్రులపై దృష్టి సారించాలని ప్రజలు, రోగులు కోరుతున్నారు.

“చర్యలు తీసుకుంటాం



రోగుల నుంచి ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేసే ప్రైవేటు ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకుంటాం. వైద్య ఆరోగ్య శాఖ నిబంధలను విధిగా పాటించాలి. డెంగీ, టైఫాయిడ్ లేకున్నా డబ్బుల కోసం పరీక్షలు చేస్తే మాకు ఫిర్యాదు చేయాలి. ఏ చికిత్స కోసం అనుమతి తీసుకుంటే దానికే వైద్యం చేయాలి. త్వరలో అన్ని ప్రైవేటు ఆస్పత్రులను తనిఖీ చేస్తాం. నిబంధనలు పాటించని వాటిపై చర్యలు తీసుకుంటాం.

– పాల్వన్‌కుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

ఫార్మాను రద్దు చేయాల్సిందే

- లేకుంటే రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం
- మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

దుద్యాల్: మండలంలో ఫార్మా కంపెనీ ఏర్పాటు నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని.. లేకుంటే రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం మండలంలోని గౌరారంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఫార్మా కంపెనీల కోసం హైదరాబాద్ పరిసర ప్రాంతాలైన మహేశ్వరం, ఇబ్రహీంపట్నం మండలాల్లో దాదాపు 14వేల ఎకరాలు కేటాయించారని, అక్కడ కాకుండా దుద్యాల మండలంలో ఏర్పాటు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఓటేసి గెలిపించిన నియోజకవర్గ ప్రజల పొట్టకొట్టే ప్రయత్నాలు మానుకోవాలని హితవు పలికారు. హకీంపేట్, పోలేపల్లి, లగచెర్ల, రోటిబండా తండా, పులిచెర్ల తండా ప్రజలు వారసత్వంగా వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, వారిని రోడ్డు పాలు చేయాలని చూస్తే ఊరుకోమని హెచ్చరించారు. బాధిత రైతుల పోరాటాలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఫార్మా కంపెనీ ఏర్పాటు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 9న పోలేపల్లి ఎల్లమ్మ దేవాలయం నుంచి దుద్యాల్ మండల కేంద్రం వరకు మహా పాదయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. రైతులు వేల సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ మహా పాదయాత్రకు మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ హాజరవుతున్నట్లు చెప్పారు. ఎలాంటి షరతులు లేకుండా ప్రతి రైతుకూ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కేవలం 30 నుంచి 35శాతం వరకే రుణమాఫీ చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, బొంరాస్‌పేట మండల అధ్యక్షుడు యాదగిరి, దౌల్తాబాద్ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోట్ల మైపాల్, నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, సలీం, మధుసూదన్ యాదవ్, నారాయణరెడ్డి, బాబర్, సురేశ్ రాజ్, శ్రీనివాస్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి లారీలు బంద్



సమావేశంలో మాట్లాడుతున్న అబ్దుల్ ఘని

తాండూరు టౌన్: లారీ కిరాయి, రవాణా చార్జీలు పెంచాలనే డిమాండ్‌తో నేటి నుంచి (మంగళ వారం) సిమెంటు లోడింగ్ లారీలను నిలిపివేస్తున్నట్లు తాండూరు లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ ఘని, శివకుమార్ తెలిపారు. సోమవారం పట్టణంలోని అసోసియేషన్ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. పదేళ్లుగా సిమెంటు కంపెనీలు లారీ కిరాయి, రవాణా చార్జీలు పెంచడం లేదన్నారు. కానీ డీజిల్, స్పేర్ పార్ట్స్, టైర్ ట్యాక్స్, ఇన్సూరెన్స్ వంటివి పెరిగాయని పేర్కొన్నారు. కిరాయి తక్కువగా చెల్లిస్తుండటంతో గిట్టుబాటు కావడం లేదన్నారు. లారీ ఫైనాన్స్ డబ్బులు చెల్లించలేక, కుటుంబాలను పోషించుకోలేక నానా అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. వెంటనే లారీ కిరాయి, రవాణా చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే సిమెంటు లోడింగ్, అన్‌లోడింగ్ చార్జీలను కంపెనీలే భరించాలన్నారు. తాండూరు లారీలకు, పది టైర్ల లారీలకు సిమెంటు లోడింగ్‌లో తొలి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అన్‌లోడింగ్ రెండు రోజుల్లో చేయని ఎడల, మూడో రోజు నుంచి నిత్యం రూ.1,200ల చొప్పున ప్రతి లారీకి చెల్లించాలన్నారు. న్యాయబద్ధమైన మా డిమాండ్లను పరిష్కరించే వరకు ఇతర జిల్లాలకు చెందిన సిమెంటు లోడింగ్ లారీలను సైతం నిలిపివేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు పట్లోళ్ల నర్సింలు, కోశాధికారి విజయ్‌భాస్కర్, సభ్యులు కేవీఆర్, శ్రీనివాస్, ఎండీ జాఫర్ తదితరులు పాల్గొన్నారు.





శ్రీవారి ఊరేగింపులో ప్రదర్శన ఇస్తున్న జిల్లా కళాకారులు



తిరుమలేశుని సన్నిధిలో కళా ప్రదర్శన

బొంరాస్‌పేట: తిరుమల తిరుపతి శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో జిల్లా కళాకారులు ప్రదర్శన ఇచ్చారు. తాండూరుకు చెందిన జానపద నృత్య గురువు అశోక్ నేతృత్వంలో నృత్యాలు లంబాడీ, గుస్సాడీ, కోయ, ధీంసా, పులివేషాలు, భక్తిరస ప్రదర్శనలు చేశారు. జిల్లాకు చెందిన జానపద కళాకారులు, పలు పాఠశాలలకు చెందిన 89మంది విద్యార్థినులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సోమవారం ఉదయం కల్ప వృక్ష వాహనం, సాయంత్రం సర్వభూపాల వాహనంపై విహరిస్తున్న శ్రీవారి ముందు గుస్సాడి, కోయ జానపద కళా ప్రదర్శన ఇచ్చారు. మంగళవారం గరుడవాహన సేవ, స్వామివారి పల్లకీ సేవ ఊరేగింపులో కూడా ప్రదర్శనలు ఉంటాయని అశోక్ మాస్టర్ తెలిపారు. ప్రత్యక్ష ప్రసారంలో చూడవచ్చునని చెప్పారు. ఈ బృందంలో తాండూరు శిశుమందిర్, మోమిన్‌పేట, బంట్వారం గురుకులాల విద్యార్థినులు, తెలంగాణ జానపద కళాకారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య, దుద్యాల మండల అధ్యక్షుడు శకనప్ప, గుండుమాల్ కృష్ణ, హన్మంతు, పెంటప్ప, రవికాంత్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

పేద ప్రజలకు అండగా ఉంటాం

పరిగి మాజీ ఎమ్మెల్యే
కొప్పుల మహేశ్ రెడ్డి



బాధిత కుటుంబీకులతో మాట్లాడుతున్న మహేశ్ రెడ్డి

కుల్కచర్ల: పేదలకు, పార్టీ కార్యకర్తలకు బీఆర్ఎస్ ఎల్లవేళలా అండగా ఉంటుందని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ చౌడాపూర్ అధ్యక్షుడు చెవ్వ రమేశ్ తల్లి రాములమ్మ ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న మహేశ్‌రెడ్డి సోమవా రం వారి కుటుంబ సభ్యులను పరామర్శించా రు. ఆయన వెంట బీఆర్ఎస్ చౌడాపూర్ మండ ల అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాందాస్ నాయక్, రాజు, రాజశేఖర్, శివకుమార్, నర్సింలు, శివకుమార్, పెంట య్య, రాములు, కృష్ణయ్య, దాసు, శ్రీను, ప్రభు, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

కురువ సంఘం అభివృద్ధికి కృషి

ఒగ్గు కళాకారుల సంఘం
రాష్ట్ర ఉపాధ్యక్షుడు పూజారి మల్లప్ప



పగిడియాలలో సభ్యత్వ నమోదు చేపడుతున్న సంఘం సభ్యులు

యాలాల: కురువ సంఘం అభివృద్ధికి నిరంతరం పాటుపడుతున్నామని రాష్ట్ర ఒగ్గు కళాకారుల సంఘం ఉపాధ్యక్షుడు పూజారి మల్లప్ప అన్నారు. సోమవారం మండల పరిధిలోని పగిడియాలలో కురువ సంఘం డివిజన్ ఉపాధ్యక్షుడు పూజారి పాండుతో కలిసి సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ.. గ్రామాల వారీగా సభ్యత్వ నమోదుకు శ్రీకారం చుట్టామన్నారు. ప్రతీ ఇంటికి వెళ్లి సభ్యత్వ నమోదు చేస్తామన్నారు. అనంతరం ఇటీవల కురవ సంఘం మండల గౌరవ అధ్యక్షుడిగా ఎన్నికైన వెంకటయ్య, మండల అధ్యక్షుడు సతీశ్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం తాండూరు పట్టణ, మండల అధ్యక్షులు మరాఠి నర్సింలు, జినుగుర్తి నర్సింలు, సంఘం ప్రతినిధులు శ్రీశైలం, వెంకటయ్య, మల్లప్ప, శేఖర్, సంపత్, దేవప్ప, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

మదర్ డెయిరీ డైరెక్టర్‌కు శుభాకాంక్షల వెల్లువ



మదర్ డెయిరీ డైరెక్టర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

దోమ: నల్గొండ, రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల ఎన్నికల్లో డైరెక్టర్‌గా విజయం సాధించిన ఆగిరాల నర్సింహారెడ్డికి శుభాకాంక్షల వెల్లువెత్తుతున్నాయి. సోమవారం హైదరాబాద్ పట్టణ పరిధిలోని హయత్‌నగర్‌లో మదర్ డెయిరీ కార్యాలయంలో డైరెక్టర్లకు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దోమ మండలం గూడూర్ గ్రామానికి చెందిన ఆగిరాల నర్సింహారెడ్డి డైరెక్టర్‌గా పాలఉత్పత్తిదారుల డైరెక్టర్‌గా విజయం సాధించి ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ నేతలు ఆయనకు శుభాకాంక్షలు చెబుతూ..శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు వెంకట్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, బంటు బాల్‌రాజ్, సుఖేందర్, మహేందర్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శిగా జగన్నాథం



నియామకపత్రం అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య

బంట్వారం: బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎ.జగన్నాథం నియమితులయ్యారు. సోమవారం నగరంలోని బీసీ భవన్‌లో సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జగన్నాథం మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ప్రధాన కార్యదర్శిగా నియమించిన ఆర్.కృష్ణయ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. హక్కుల సాధనకు శక్తి వంచన లేకుండా పోరాడుతానన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మూడు నెలలే 'జీరో'!

- సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు విద్యుత్ బిల్లులు
- 'గృహజ్యోతి' పొరపాట్లతో జనం పాట్లు
- వెబ్‌సైట్‌లో తొలగించినట్లు చూపుతున్న వైనం
- ప్రజాపాలన కౌంటర్లలో వివరాలు లేవంటున్న అధికారులు



ప్రజాపాలన కౌంటర్‌లో ఆరాతీస్తున్న బాధితులు

దుద్యాల్: జూన్ నుంచి కొడంగల్ నియోజకవర్గంలో గృహజ్యోతి పథకం అమలు చేస్తున్నారు. దీంతో 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగిస్తున్నవారికి ప్రభుత్వం బిల్లులు రద్దు చేస్తోంది. కానీ జూన్‌లో జీరో బిల్లు అమలైన మీటర్ సర్వీస్ నంబర్‌కు తర్వాత నెలలో మాత్రం బిల్లు రావడంతో వినియోగదారులు అవాక్కయ్యారు. ఈ ఘటన మండల పరిధిలోని హస్నాబాద్‌లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఆశప్పకు ఇంటి విద్యుత్ మీటర్ సర్వీస్ కనెక్షన్ నంబర్ 104035392 జూన్ నుంచి ఆగస్టు వరకు జీరో బిల్లు అమలైంది. సెప్టెంబర్, అక్టోబర్ మాత్రం బిల్లు వచ్చింది. దీంతో సదరు వినియోగదారుడు విద్యుత్ కార్యాలయ అధికారులను సంప్రదించగా మా దగ్గర వివరాలుండని సమాధానమిచ్చారు. ఎంపీడీఓ కార్యాలయంలోని ప్రజాపాలన కేంద్రంలో సంప్రదించాలని సూచించారు. దీంతో ఆయన నేరుగా ప్రజాపాలన కేంద్రానికి వెళ్లగా మీ వివరాలు లేవని చెప్పడం బాధితుడు ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు. దీంతో మరోసారి వివరాలు నమోదు చేయించానని బాధితుడు వాపోయాడు.

సాఫ్ట్‌వేర్ అప్‌డేట్‌తో సాంకేతిక సమస్య

దీంతో ప్రజాపాలన కేంద్రం కౌటర్‌లో అధికారులను 'సాక్షి' వివరణ కోరగా నెల రోజుల క్రితం విద్యుత్ అధికారులే వచ్చి సాఫ్ట్‌వేర్ అప్డేట్ చేశారని దీంతో కొంత మంది వివరాలు తొలిగిపోవచ్చునని వివరించారు. నిత్యం ప్రజాపాలన కౌటర్‌కు ఇదే సమస్యపై వందల సంఖ్యలో బాధితులు వస్తున్నారని ఎంపీడీఓ కార్యాలయ అధికారులు వెల్లడించారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి పేద ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పలువు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కసారి నమోదైన వివరాలు ఎలా తొలగిపోయాని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తు న్నారు. విద్యుత్ అధికారులే కావాలని ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారేమోనని పలువురు వాపోతున్నారు. ఇబ్బందులకు గురిచేసే అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



ఆగస్టులో వచ్చిన జీరో విద్యుత్ బిల్లు



సెప్టెంబర్, అక్టోబర్‌లో వచ్చిన బిల్లులు

నీటి సరఫరాలో సమస్యలుండొద్దు

మిషన్ భగీరథ ఈఈ చల్మారెడ్డి

మోమిన్‌పేట: గ్రామాల్లో మిషన్ భగీరథ నీటిని సమయానుకూలంగా సరఫరా చేయాలని మిషన్ భగీరథ ఈఈ చల్మారెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామీణ మంచినీటి సహాయకుల శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. సోమవారం ఈ శిబిరాన్ని చల్మారెడ్డి ప్రారంభించి మాట్లాడారు. తాగు నీటిని తగు మోతాదు మేరకు సరఫరా చేయాలన్నారు. వృథాను అరికట్టాలని సూచించారు. పైప్‌లైన్ లీకేజీలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. చేతి పంపుల మరమ్మతులు ఇక నుంచి మీరే చేయాలని ఆయన చెప్పారు. సింగిల్ ఫేజ్ మోటారులు కాలిపోవడం మినహాయిస్తే మిగిలిన మరమ్మత్తులకు శిక్షణ తరగతుల్లో నేర్పిస్తారని వివరించారు. పంచాయతీల్లో తాగు నీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. పైప్‌లైన్ లీకేజీలకు వెంటనే మరమ్మతు చేయడం, ట్యాంకులను ప్రతి 15రోజులకోమారు శుభ్రం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ డీఈఈ రత్న ప్రసాద్, సుచరిత, ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంపీఓ యాదగిరి, ఏఈఈ అభిషేక్ తదితరులు ఉన్నారు.



మోమిన్‌పేట: మాట్లాడుతున్న చల్మారెడ్డి

నీటిని పొదుపుగా వాడాలి

బంట్వారం: మిషన్ భగీరథ నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఈఈ చల్మారెడ్డి అన్నారు. సోమవారం కోట్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో సహాయకులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణకు హాజరైన ఆయన పలు సూచనలిచ్చారు. నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ప్లంబర్లు లీకేజీలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రిడ్ ఎంట్రా డీఈ తేజబాబు, ఇన్‌చార్జి ఎంపీడీఓ డానియల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వేణుమాధవ్, ట్రైనర్‌లు, పంచాయతీ కార్యదర్శులు, నీటి సరఫరా సహాయకులు పాల్గొన్నారు.

వేధింపుల కేసులో భర్తకు రిమాండ్

బంట్వారం: భార్యా పిల్లలను వేధిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు సోమవారం రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని తొర్మామిడి గ్రామానికి చెందిన కె.ప్రసన్నకు ఎనిమిదేళ్ల క్రితం కోహిర్ మండలం పైడిగుమ్మలకు చెందిన రాజుతో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. తాగుడుకు బానిసైన రాజు నిత్యం భార్యాపిల్లలను వేధిస్తుండడంతో ఆయన భార్య బంట్వారం ఠాణాలో ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు రాజుపై కోహిర్ పీఎస్‌లోనూ పలు కేసులు నమోదైనట్లు గుర్తించారు. ఈ మేరకు రాజును రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

సీఐగా శ్రీనివాస్‌గౌడ్ బాధ్యతల స్వీకరణ

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి సీఐగా శ్రీనివాస్‌గౌడ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. శంకర్‌పల్లిలో పనిచేసిన సీఐ బదిలీ కావటంతో ఆయన స్థానంలో శ్రీనివాస్‌గౌడ్‌ను నియమించారు. బాధ్యతల స్వీకరించిన శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులోఉంటూ సమస్యల పరిష్కరిస్తానని చెప్పారు. అసాంఘిక కార్యక్రమాలపై కఠిన చర్యలు తీసుకుంటానన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

బస్సు ఎక్కుతుండగా నగదు, నగలు చోరీ

షాద్‌నగర్‌రూరల్: బస్సు ఎక్కుతున్న మహిళ పర్సులోంచి నగలు, నగదు చోరీకి గురైన ఘటన షాద్‌నగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో చోటు చేసుకుంది. ఎస్ఐ శరత్ తెలిపిన ప్రకారం.. కేశంపేట మండలం చింతకొండపల్లికి చెందిన అలివేలు ఆదివారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో షాద్‌నగర్ బస్టాండ్‌లో జడ్చర్ల బస్సు ఎక్కింది. బస్సు ఎక్కుతున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు అలివేలు పర్సులో ఉన్న రెండు తులాల బంగారు ఆభరణాలు, రూ.28వేల నగదును దోచుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సోమవారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిత్యావసర ధరలు తగ్గించాలి

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకట్‌రాములు

పరిగి: నిత్యావసర ధరలు పెరిగి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకట్‌రాములు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణ కేంద్రంలో సీపీఎం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ నేటికీ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలనే అవలంబిస్తోందన్నారు. ప్రపంచమంతా ముడి చమురు ధరలు తగ్గుతున్నా మన దేశంలో మాత్రం విపరీతంగా పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం జమిలి ఎన్నికల పేరిట రాష్ట్రాలకు ఉన్న ఫెడరల్ వ్యవస్థను నాశనం చేసేందుకు యత్నిస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తొమ్మిది నెలలైనా ఆరు గ్యారంటీలను అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి ఇప్పుడు సగం మందికి కూడా చేయలేరని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు జగదీశ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకట్‌రాములు

ప్రాధాన్యతా క్రమంలో పరిష్కారం



దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

ప్రజావాణిలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

అనంతగిరి: ప్రజావాణి ఫిర్యాదులను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని అదనపు కలెక్టర్(రెవెన్యూ) లింగ్యానాయక్ అన్నారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్(స్థానిక సంస్థలు) సుధీర్‌తో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజావాణికి 115 దరఖాస్తులు అందాయని.. సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. తమ పరిధిలో ఉన్నవాటిని పరిష్కరించాలని.. లేదంటే తగు సూచనలివ్వాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వాసుచంద్ర తదితరులు పాల్గొన్నారు.



మోమిన్‌పేట: ప్రజావాణిలో పాల్గొన్న ఎంపీడీఓ విజయలక్ష్మి

ప్రజావాణికి మూడు దరఖాస్తులు

మోమిన్‌పేట: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మూడు దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. భరత్‌నగర్ కాలనీలో మిషన్ భగీరథ నీరు, మురుగు నీటి కాల్వల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. ఒకరు పింఛన్‌కు, మరొకరు ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ డబ్బులు రావడం లేదని ఫిర్యాదు చేశారన్నారు. విచారణ చేసి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మనోహర్‌చక్రవర్తి, ఏపీఎం రాజు, ఏపీఓ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మంనాచారం గ్రామంలో సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ వాసుచంద్ర(ఫైల్)

'ఫ్యామిలీ' సర్వే పూర్తి

- పైలెట్ ప్రాజెక్టు కింద ఖమ్మం నాచారంలో కుటుంబాల వారీగా వివరాల సేకరణ
- నివేదికలు ఉన్నతాధికారులకు అందజేత

దోమ: పేదలకు సంక్షేమ పథకాలను అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఫ్యామిలీ డిజిటల్ కార్డులను ఇచ్చేందుకు నిర్ణయించింది. ఈ మేరకు ఉన్నతాధికారులు జిల్లాలోని దోమ మండలం ఖమ్మంనాచారం గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. గ్రామం జనాభా ఎంత? ఎన్ని కుటుంబాలు? అర్హులైన కార్డు దారులు ఎంత మంది ఉన్నారనే సమగ్ర సర్వేను నిర్వహించేందుకు ప్రత్యేకాధికారులను నియమించారు. దీంతో అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యాటించి సర్వేను సమర్థవంతంగా పూర్తి చేశారు.

148 కుటుంబాలు

కుటుంబాల వారీగా డిజిటల్ కార్డులు ఇచ్చేందుకు ప్రభుత్వం సర్వే చేపట్టింది. ఈ క్రమంలో అధికారులు ప్రతీ కుటుంబానికి సంబంధించి వారి వివరాలు ఒకే కార్డులో ఉంచేలా సర్వే నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ కుటుంబ సభ్యులు వివరాలు సేకరించారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు అందజేశారు. వీరి సర్వేలో గ్రామంలో మొత్తం 148 కుటుంబాలు ఉండగా.. అందులో 102 పాత కుటుంబాలు, 46 కొత్త కుటుంబాలను గుర్తించారు. 424 మంది జనాభా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. డిజిటల్ కార్డులో భాగంగా కుటుంబ సభ్యుల వ్యక్తిగత ఐడీలతో పాటు వారి వివరాలను ఒకే కార్డు చేర్చేలా ప్రభుత్వం విధి విధానాలను రూపొందిస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

పకడ్బందీగా సర్వే



డిజిటల్ కార్డు ప్రక్రియలో భాగంగా ఖమ్మంనాచారం గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. తహసీల్దార్‌తో పాటు పంచాయతీ కార్యదర్శులతో కలసి సర్వేను పూర్తి చేయాలని అధికారులు సూచించారు. క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి సర్వేను పకడ్బందీగా నిర్వహించాం. గ్రామంలో మొత్తం 148 కుటుంబాలు ఉన్నాయి. నివేదికలు ఉన్నతాధికారులకు అందజేశాం.

– మహేశ్‌బాబు, ఎంపీడీఓ, దోమ

వీధి కుక్కల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

సీడీఎంఏ గౌతమ్



జంతు జనన నియంత్రణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీడీఎంఏ గౌతమ్, కలెక్టర్ ప్రతీక్‌జైన్

పరిగి: పట్టణాల్లో వీధి కుక్కల నియంత్రణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని సీడీఎంఏ(కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్) గౌతమ్ అన్నారు. సోమవారం ఆయన పట్టణ కేంద్రంలోని జంతు జనన నియంత్రణ కేంద్రాన్ని, మున్సిపల్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం సీడీఎంఏ గౌతమ్ మాట్లాడుతూ.. పట్టణ కేంద్రంలో కాలనీ, వార్డుల వారీగా కుక్కలకు ఆపరేషన్లు చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రత్యేక టీంలతో కుక్కలను బంధించి కేంద్రానికి తీసుకువచ్చి ఆపరేషన్లు చేస్తున్నామని పశువైద్యులు ఆయనకు వివరించారు. పట్టణాన్ని ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చెత్త సేకరణ వాహనాలకు జీపీఎస్ సిస్టంను ఏర్పాటు చేయాలన్నారు. త్వరలోనే డంపింగ్‌యార్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పన్ను సేకరణలో వెనుకబడి ఉన్నారని కేవలం 30శాతం మాత్రమె పన్ను వసూలు చేశారని త్వరలోనే వందశాతం పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. పట్టణ ప్రజలకు అధికారులు నిత్యం అందుబాటులో ఉండాలని ప్రజలకు ఎలాంటి సమస్యలు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుందఅశోక్‌కుమార్, కమిషనర్ వెంకటయ్య, డీఈఈ రాకేశ్, మేనేజర్ నరేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సామరస్యంగా పరిష్కరించుకోవాలి

డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి

దోమ: భూ వివాదాలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి సూచించారు. సోమవారం ఆయన తహసీల్దార్ పురుషోత్తం, సీఐ శ్రీనివాస్‌తో కలసి రాకొండ గ్రామంలో భూ వివాదం జరిగిన ప్రాంతానికి వెళ్లి గొడవలకు పాల్పడిన రైతులతో మాట్లాడి వివాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. అసైన్డ్ భూములైనా.. పట్టా భూములైనా.. వివాదాల్లో ఉంటే రెవెన్యూ, పోలీసులతో పరిష్కరించుకోవాలని తెలిపారు. ఆవేశాలకు పోయి ప్రాణాలమీదకు తెచ్చుకోవద్దన్నారు. రాకొండ గ్రామంలో సర్వే నంబర్ 94లో రైతులకు ప్రభుత్వం ఇచ్చిన భూములను రెవెన్యూ అధికారులు సర్వేలు చేసి హద్దులు కేటాయిస్తారని.. ఆవేశాలతో గొడవలు సృష్టించుకోవద్దన్నారు. డీఎస్పీ వెంట ఎస్ఐ ఆనంద్‌కుమార్, ఆర్ఐలు రాంచంద్రారావు, సుదర్శన్, వీఆర్ఏలు, కానిస్టేబుల్స్ తదితరులు ఉన్నారు.



రాకొండలో గొడవకు పాల్పడిన రైతులతో మాట్లాడుతున్న డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి

గుర్తు తెలియని వాహనం ఢీ

వ్యక్తికి తీవ్ర గాయాలు

కేశంపేట: బంధువుల ఇంటి నుంచి తిరుగుప్రయాణమైన వ్యక్తి గుర్తు తెలియని వాహనం ఢీకొని గాయపడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ శివారులో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. ఫరూఖ్‌నగర్ మండలం బూర్గుల గ్రామానికి చెందిన గొల్ల యాదయ్య పాపిరెడ్డిగూడలో అత్తగారింటికి వచ్చి వెళ్తున్నాడు. ఈ క్రమంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో షాద్‌నగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా.. వెలిజర్ల శివారులోని మైనింగ్ పరిశ్రమ నుంచి టిప్పర్లు అధికలోడ్‌తో వెళ్తుండడంతో గ్రామస్తులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని.. పోలీసు అధికారులు స్పందించి అధికలోడ్‌తో వెళ్తున్న వాహనాల రాకపోకలను అరికట్టాలని గ్రామస్తులు కోరారు.



గాయపడిన యాదయ్య

అక్రమార్కుల ఆటకట్టు

కావలోనిబాయి తండా, తుమ్మలూరులో మట్టి తవ్వకాలు

- ఆరు వాహనాలు సీజ్
- ఎనిమిది మందికి రిమాండ్

మహేశ్వరం: అసైన్డ్ భూమిలో అక్రమంగా తవ్వకాలకు పాల్పడుతూ మట్టిని తరలిస్తున్న మూడు ఇటాచీలు, మూడు టిప్పర్లను సీజ్ చేసి ఎనిమిది మందిని రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన మహేశ్వరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని తుమ్మలూరు, కావలోనిబాయి తండాలో సోమవారం చోటు చేసుకుంది. మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన ప్రకారం.. మహేశ్వరం పంచాయతీ పరిధిలోని కావలోనిబాయి తండాలో సర్వే నంబర్ 461లో ఉన్న అసైన్డ్ భూమిలో డబీల్‌గూడ గ్రామానికి చెందిన పి.ప్రసాద్, కావలోనిబాయి తండాకు చెందిన ఎం.పంతునాయక్ తవ్వకాలు చేపట్టి మట్టిని తరలిస్తున్నారు. తుమ్మలూరు గ్రామంలో సర్వే నంబర్ 315లో రాజమోని రమేశ్, మామిడిపల్లికి చెందిన జెటావత్ రవినాయక్, కందుకూరు చౌరస్తాకు చెందిన కాసుల వినోద్‌రెడ్డి, తుమ్మలూరుకు చెందిన జెనిగె ప్రశాంత్ యాదవ్, సరస్వతిగూడకు చెందిన ముఖేశ్, లేమూర్ గ్రామానికి చెందిన కడారి నాగార్జున మట్టి తవ్వకాలకు పాల్పడుతున్నారు. ఫిర్యాదు అందుకున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ స్వర్ణకుమారి ఘటనా స్థలానికి చేరుకున్నారు. కావలోనిబాయిలో ఓ ఇటాచీ, ఓ టిప్పర్, తుమ్మలూరులో రెండు ఇటాచీలు, రెండు టిప్పర్లను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా తవ్వకాలు పాల్పడుతున్న ఎనిమిది మందిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐలు వెంకట్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాలకు పాల్పడితే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సీఐ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ సైదులు హెచ్చరించారు. పట్టా రద్దు చేసి పీఓటీకి భూమిని ప్రభుత్వం సాధీనం చేసుకుంటుందన్నారు.



కావలోనిబాయి తండా సమీపంలో అక్రమార్కుల తవ్వకాలతో ఏర్పడిన గుంతలు